క్లుప్తంగా

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

వీపనగండ్ల: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రాణి ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా కొద్దిపాటి డబ్బులు చెల్లిస్తే లక్షల్లో లోన్లు మంజూరు చేస్తామని సైబర్ నేరగాళ్లు ప్రజలకు వల విసురుతున్నారన్నారు. వీటితో పాటు యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత చదువుల్లో రాణించాలని విజ్ఞప్తి చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

షెడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



అమరచింత: మండలంలోని శ్రీఅడవి ఆంజనేయ ఆలయ సమీపంలో భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో నూతన రేకుల షెడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. గ్రామ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి తమ సొంత స్థలాన్ని దానంగా ఇవ్వగా గోవిందు, మనెమ్మలు రేకుల షెడ్‌కు నిర్మాణానికి విరాళం అందజేశారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం.నాగరాజ్‌గౌడ్ స్వామి భూమి పూజ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి తన వంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వ్యవసాయ పనులు ముగియడంతో వివిధ ప్రాంతాల నుంచి రైతులు, కూలీలు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మైసమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. బంధుమిత్రులకు విందు ఏర్పాటు చేశారు. మొత్తం 6 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునట్లు మైసమ్మ దేవత ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అలంపూర్ రూరల్: సర్వభూత దయాపరా రక్ష రక్ష మహభాహో అంటు అయ్యప్ప స్వాములు చేసిన శ్లోకాలు, శరణగోషతో పట్టణంలోని వడ్లచారి వీధి పులకరించింది. వడ్లచారి వీధిలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వినాయక, కుమార స్వామి, లక్ష్మీదేవి, అయ్యప్ప స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి 18 సోపనాలపై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్వాములు ఆనంద్, ఎల్లయ్య, లక్ష్మీనారయణ, శ్యామ్, రాము, హరినాథ్, విజయ్ కృష్ణ, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి ఉత్సవాలు

- గ్రామంలో బండ్ల ఊరేగింపు
- బోనాలతో వెళ్లి మొక్కులు తీర్చుకున్న మహిళలు



అమ్మవారి మూలవిరాట్టు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లిలో చౌడేశ్వరీదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఆదివారం గ్రామంలోని పాకనాటి గొల్లలు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ముందుగా గొర్రెపొటేళ్లతో తయారు చేసిన బండిపై అమ్మవారిని ఊరేగించారు. మహిళలు కుంకుమ, పసుపు, పూలు, గంధంతో బోనంను అందంగా అలంకరించారు. ఆడుతూపాడుతూ చౌడేశ్వరీదేవి ఆలయానికి ర్యాలీగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈఉత్సవాల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని నిర్వాహకులకు హామీ ఇచ్చారు. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపును నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా బంధువులు, ఆడపడుచులు గ్రామానికి చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



గొర్రెపొటేళ్లతో అమ్మవారి బండిని లాగిస్తున్న యాదవులు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాళ్ల గ్రామంలో ఆదివారం చౌడేశ్వరీ అమ్మవారి భవనాన్ని సంఘ నాయకులు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోని చౌడేశ్వరీ అమ్మవారి సంఘ సభ్యులు అందించిన సహకారంతో ఈ భవనాన్ని నిర్మించినట్లు సంఘం నాయకులు తెలిపారు. నూతనంగా నిర్మించిన భవనంలో అమ్మవారి చిత్రపటానికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కల్వరి వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, మద్దిలేటీ, మోహన్, రామకృష్ణ, హరిప్రసాద్, అంజి, చంద్రకళ, భాగ్యలక్ష్మీ, సుశీల తదితరులు పాల్గొన్నారు.





మారేమ్మయాడి..హుదో..హుదో

- భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన మారేమ్మ ఉత్సవాలు

అమరచింత: హుదో..హుదో మారేమ్మ యాడి హుదో హుదో అంటూ తండాల్లో మారేమ్మ దేవత నామస్మరణ మార్మోగింది. ఆదివారం మండలంలోని చంద్రనాయక్ తండా, తూక్యానాయక్ తండా, దీప్లానాయక్ తండా, కొత్త తండాల్లో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. లంబాడీలు సంప్రదాయ వస్త్రాలు అలంకరించుకుని ఆలయం వద్ద నృత్యాలు ప్రదర్శిస్తు, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇంటింటికి బోనంతో పాటు పొట్టేళ్లు, కోడిపుంజులు అమ్మవారికి బలిచ్చి తమ కష్టాలను దూరం చేసి సుఖశాంతులతో ఉండేలా దీవించాలని పూజలు చేశారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కుమారుడు అచ్యుతరామ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మహిళ



నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు



ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



అమ్మవారిని దర్శించుకుంటున్న అచ్యుత్ రామ్

బీఆర్ఎస్ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

నాగర్‌కర్నూల్ క్రైం: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, ఏడాది క్రితం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించామని టీపీసీసీ స్పోక్స్ పర్సన్ లింగం యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏడాది ప్రజా పాలనపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 5 వేల స్కూళ్లను మూసివేస్తే కాంగ్రెస్ ఏడాది పాలనలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ప్రారంభించడంతోపాటు కాస్మొటిక్, డైట్ చార్జీలను పెంచారన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచామని, రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో కేసీఆర్ పదవిలలో చేయని అభివృద్ధిని ఏడాదిలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసి చూపించారని అన్నారు. బిఆర్ఎస్ పాలనలో మంత్రులు ఎవరు మాట్లాడేవారు కాదని కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ స్వేచ్ఛ ఉందని అన్నారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి పనులకు ప్రతిపక్షాలు తమ సలహాలు సహకరించాలి తప్ప వాటిని అడ్డుకోవడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ స్కిల్ యూనివర్సిటీని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. సమావేశంలో స్పోక్స్ పర్సన్ ఆచారి, కౌన్సిలర్లు జక్క రాజ్ కుమార్ రెడ్డి, సునేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి లింగంయాదవ్

మామిడి మురిపించేనా..?

- పూత ప్రారంభ దశలో వాతావరణంలో అనూహ్య మార్పులు
- అకాల వర్షాలతో చిగుర్లు వస్తున్న వైనం
- చలి కారణంగా పెరిగిన తెగుళ్ల తీవ్రత
- పురుగు మందులకు రూ.వేలు వెచ్చిస్తున్న రైతులు



కొల్లాపూర్ శివారులో మామిడి తోట

కొల్లాపూర్: వాతావరణంలో అనూహ్యంగా సంభవిస్తున్న మార్పులు మామిడి రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. తీవ్రమైన చలి, కాగు మంచు, అకాల వర్షాలు మామిడి దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో చోటుచేసుకున్న వాతావరణ ప్రభావం మామిడి తోటలపై పడింది. తెగుళ్ల నివారణ, పూతలు రావడం కోసం ఒక్కో రైతు ఇప్పటికే రూ.వేలు ఖర్చు చేశారు.

జిల్లాలో మామిడి సాగు..

జిల్లావ్యాప్తంగా 34,712 ఎకరాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారు. గత ఐదేళ్ల కాలంగా ఏటా 3 వేల ఎకరాల మేరకు సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లో 9 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతుండగా.. ఒక్క కొల్లాపూర్ నియోజకవర్గంలోనే అధికంగా 25 వేల ఎకరాలకు పైగా మామిడి సాగు జరుగుతోంది.

పూతలపై ప్రభావం..

నవంబర్ నెల నుంచి మామిడి తోటల్లో మొదటి పూతలు ప్రారంభమవుతాయి. డిసెంబర్ నెలలో రెండో దశ పూతలు వస్తాయి. అయితే నవంబర్ నెలలో పూతలు ప్రారంభమైనప్పటికీ తీవ్రమైన చలి, అకాల వర్షాల వల్ల పూతలు నల్లబడ్డాయి. దోమ, తేనెమంచు, పచ్చ పురుగులు పూతలను ఆశించాయి. వీటి నివారణ కోసం రైతులు రూ.వేలు వెచ్చించి రసాయన మందులు పిచికారీ చేసినా పూతలు నిలవలేదు. ఈ నెల ప్రారంభం నుంచి రెండో దశ పూతలు ప్రారంభమయ్యాయి. అకాల వర్షాల కారణంగా చాలా తోటల్లో పూతలకు బదులుగా చిగుర్లు వస్తున్నాయి. దీంతో పూతలు పూర్తి స్థాయిలో వచ్చేందుకు ఈసారి ఆలస్యమయ్యే పరిస్థితులు దాపురించాయి.

తుఫాన్ల ప్రభావం..

ఆంధ్రప్రదేశ్‌లో సంభవిస్తున్న తుఫాన్ల ప్రభావం నాగర్‌కర్నూల్ జిల్లాపై పడుతోంది. అక్కడ తుఫాన్లు ఉన్నప్పుడు కొల్లాపూర్‌తోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారిపోతాయి. చల్లటి గాలుల కారణంగా తెగుళ్ల బెడద తీవ్రమవుతోంది. కాగు మంచు వల్ల కూడా పురుగుల బెడద పెరుగుతోంది. గత 15 రోజుల వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్‌లో రెండు తుఫాన్లు రావడంతో ఆ ప్రభావం జిల్లాలోని మామిడి తోటలపై పడింది.

మామిడి సాగు వివరాలు ఇలా..

నియోజకవర్గం	తోటలు సాగు చేస్తున్న రైతులు	విస్తీర్ణం ఎకరాల్లో
కొల్లాపూర్	11,981	25,237
కల్వకుర్తి	1,084	4,547
నాగర్‌కర్నూల్	771	2,510
అచ్చంపేట	622	2,418
మొత్తం	14,458	34,712

సస్యరక్షణ చేపట్టాలి



మామిడి పూతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. నవంబర్‌లో వచ్చిన పూతలు కొన్నిచోట్ల దెబ్బ తిన్నాయి. చల్లగాలలు, అకాల వర్షాల ప్రభావం మామిడి పూతలపై ఉంటుంది. ఈ నెలలో మామిడి చెట్లకు నీళ్ల పెట్టొద్దు. భూమి బెట్టగా ఉంటేనే పూతలు వచ్చేందుకు వీలుగా ఉంటుంది. మామిడికి అధికంగా తేనె మంచు, బంక, బూడిద తెగుళ్ల వ్యాప్తి చెందుతాయి. వీటికి సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు ఉంటాయి. తెగుళ్ల నివారణకు మందులు ఎలా వాడాలనే అంశాలను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం.

– లక్ష్మణ్, ఉద్యాన అధికారి, కొల్లాపూర్

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి



ఆత్మీయ సమ్మేళనంలో మాజీ సైనిక ఉద్యోగులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఎస్‌ఐ సురేష్‌గౌడ్, గోపాల్‌పేట ఎంఈఓ (విద్యార్థుల గురువు) శ్రీనివాసులుగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. సల్కెలాపురంలోని రవీంద్రనాథ్‌రెడ్డి ఇంటి వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆర్మీలో విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ పొందిన గుంపలి చంద్రశేఖర్, చెన్నయ్య, గోవర్ధన్‌రెడ్డిని మిత్రులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్‌ఐ, ఎంఈఓను వారు సన్మానం చేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. సహపంక్తి భోజనం చేస్తూ ఆనందం గడిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

చిన్నంబావి: వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని ఆపార్టీ రాష్ట్ర నాయకుడు ధారాసింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏడాది పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో పండుగలను చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కంటే కాంగ్రెస్ ఏడాది పాలనలోనే అధిక నష్టం జరిగిందని ఆరోపించారు. అమాయక ప్రజల ఆస్తులను కొల్లగొట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. ప్రజలు బీజేపీ వైపు ఉన్నారని, స్థానిక ఎన్నికల్లో మెజార్టీ సీట్లను గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు జగ్గారి శ్రీదర్ రెడ్డి, గోపినాయుడు, నాగేంద్రం నాయుడు, కిరణ్‌కుమార్, సాయిప్రణీత్‌గౌడ్, పురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత మండలంగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: మండలాన్ని క్షయ రహిత మండలముగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షయ(టీబీ) నివారణ కోసం 100 రోజుల పాటు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించినట్లు తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరీక్షలు నిర్వహించి క్షయ రోగులను గుర్తించి సత్వరం వైద్యం అందించడం ప్రచార కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు. రోగుల వద్ద అంబులెన్స్ వాహనం వచ్చి పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 9వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి నెల వరకు కొనసాగుతుందన్నారు. గ్రామాలకు వచ్చే వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

అమరచింత: పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందన్నారు. సృష్టిని నిర్మించిన ఆ పరమాత్ముని ప్రభోదనలు ప్రతి ఒక్కరూ విని భక్తి భావంతో ఉండాలన్నారు. ఆదివారం సృష్టి మొదలుకు గుర్తు అని, సోమవారం అనేది ఆత్మ జ్ఞానానికి గుర్తన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ, పెబ్బేరు కమిటీ, మద్దిగట్ల కమిటీ అధ్యక్షులు, సభ్యులు విజయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి ,రాఘవేంద్ర, నరేందర్, పురుషోత్తం శ్రేష్టి, రామచంద్రయ్య, బాలకృష్ణ, పద్మ, శాంతి, అనిత, జ్యోతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపుతో పొంచి ఉన్న ప్రమాదం



సంపత్‌రావుపల్లి గ్రామ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

వీపనగండ్ల: మండలంలోని సంపత్‌రావుపల్లి, తూంకుంట గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుపై ప్రమాదకరమైన మలుపుతో ప్రమాదం పొంచి ఉంది. సంపత్‌రావుపల్లి గ్రామ సమీపంలో రోడ్డుకిరువైపుల కంపచెట్లు ఉన్నాయి. దీంతో ఆ మలుపు ప్రమాదకరంగా మారింది. ద్విచక్రవాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. మలుపు వద్ద ఇరువైపుల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

హైటెక్ పద్ధతిలో వ్యవసాయం



గోకులపాడులో కందిపంటకు డ్రోన్‌తో మందు పిచికారీ చేస్తున్న రైతులు

డ్రోన్లతో మందు పిచికారీ

మానవపాడు: వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని కొందరు ఉపాధి పొందుతున్నారు. రైతులకు నేస్తాలుగా మారుతూ.. ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఆదివారం మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన పరుశరాముడు రూ. 4.30 లక్షల డ్రోన్‌తో పంట పొల్లాల్లో మందు పిచికారీ చేస్తూ ఉపా ధి పొందుతున్నాడు. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని రైతులకు నేస్తాలుగా కొత్త ఆలోచనలతో యువకులు మారుతున్నారు. మిరప, కంది పొలా ల్లో డ్రోన్లతో మందు పిచికారి చేస్తూ రైతులకు నేస్తాలుగా మారుతున్నారు.





మల్దకల్‌లో కూలీలను తరలిస్తున్న బొలేరోవాహనం

పరిమితికి మించి ప్రయాణం

గద్వాల(మల్దకల్) : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రైవేటు గూడ్స్ వాహన దారులు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గట్టు, కేటీదొడ్డి, అయిజ మండలాల నుంచి నిత్యం మల్దకల్ మండలంలోని వివిధ గ్రామాలకు 10నుంచి 30కు పైగా గూడ్స్ వాహనాల్లో కూలీలను చేరవేస్తున్నారు. ఒక్కో వాహనంలో 30 నుంచి 50మంది కూలీలను చేరవేస్తుండడంతో చిన్నపాటి ప్రమాదం జరిగినా భారీగా ప్రాణనష్టం జరిగే ప్రమాదముందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రైవేటు గూడ్స్ వాహన దారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.